నమస్తే తెలంగాణ
యాదాద్రి భువనగిరి
I హైదరాబాద్, ఆదివారం 30 మార్చి 2025 YADADRI BHUVANAGIRI



సూర్యాపేటలో ఇఫ్తార్ విందులో భోజనం ఒడ్డిస్తున్న మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, చిత్రంలో మాజీ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్

# సంస్కృతులను గౌరవించుకునేందుకే ఇఫ్తార్

- దేశంలో ఇఫ్తార్ విందులను ప్రారంభించిన ఘనత బీఆర్ఎస్‌దే
- గాంధీజీ చెప్పిన గంగా జమున తెహజీబ్‌ను తెలంగాణలో చూపిన ఘనుడు కేసీఆర్
- మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి
- సూర్యాపేటలో ఇఫ్తార్ విందు

సూర్యాపేట టౌన్, మార్చి 29 : సమాజంలో ఒకరి సంస్కృతిని మరొకరు గౌరవించుకునేలా రాష్ట్రంలో ఇఫ్తార్ విందులను బీఆర్ఎస్ పార్టీ ప్రారంభించిందని, ప్రతి రంజాన్ సమయంలో అది కొనసాగుతున్నదని మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. రంజాన్‌ను పురస్కరించుకొని శనివారం స్థానిక సుమంగళి ఫంక్షన్‌హాల్‌లో ఆయన ఇఫ్తార్ విందు ఇచ్చారు. ఈ సందర్భంగా జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ దేశంలో ఒకరి మతాన్ని మరొకరు గౌరవించుకునే సాంప్రదాయానికి తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ నాంది పలికారన్నారు. ఈ సంస్కృతిని ప్రజలకు అలవాటు చేయాలని మొదటగా ప్రభుత్వమే అది ఆచరించాలని నాడు ముఖ్యమంత్రి హోదాలో కేసీఆర్ ఇఫ్తార్ విడుదలను ఏర్పాటు చేసేలా జీఓ జారీ చేశారని గుర్తు చేశారు. అలా పట్టణాలు, గ్రామాల్లో ఇఫ్తార్ విందులు ప్రారంభమయ్యాయన్నారు. దేశంలో ఇఫ్తార్ విందులను ప్రారంభించిన ఘనత బీఆర్ఎస్‌దేనన్నారు. గాంధీజీ చెప్పిన గంగ జమున తెహజీబ్ సంస్కృతిని తెలంగాణలో ఆచరణలో చూపించిన ఘనుడు కేసీఆర్ అని కొనియాడారు. ఒకరి మతాన్ని మరొకరు గౌరవించుకుంటూ కలిసిమెలిసి ఆనందోత్సాహాల నడుమ పండుగలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ పుట్ట కిశోర్, మాజీ జడ్పీటీసీ జీడి భిక్షం, మాజీ కౌన్సిలర్ షేక్ బాషామియా, ఎస్కే తాహేర్, మాజీ మున్సిపల్ కో ఆప్షన్ సభ్యులు సయ్యద్ రియాజుద్దీన్, సయ్యద్ సలీం, బత్తుల రమేశ్, జలీల్‌పాషా, షకీల్, కరాటే సయ్యద్, ఎస్కే రఫీ పాల్గొన్నారు.

# నూతన సంవత్సర శోభ

## నేడు విశ్వావసు నామ సంవత్సరం • మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి శుభాకాంక్షలు

తెలుగు నూతన సంవత్సరాది శ్రీ విశ్వావసు శోభ ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఉట్టిపడుతున్నది. కొత్త సంవత్సరానికి స్వాగతం పలికేందుకు హిందువులంతా సిద్ధమవుతున్నారు. పండుగ పూట షడ్రుచుల సమ్మేళనమైన ఉగాది పచ్చడి చేసుకునేందుకు శనివారం కొత్త కుండలు కొనుగోలు చేశారు. ఉమ్మడి జిల్లా ప్రజలకు మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. విశ్వావసునామ సంవత్సరంలో అంతా మంచే జరగాలని, ప్రజలందరి జీవితాల్లో సరికొత్త వెలుగులు నిండాలని ఆకాంక్షించారు. ఈ సంవత్సరంలోనైనా పాలకులు ప్రజలను పట్టించుకోవాలని, ప్రకృతి కరుణించాలని కోరుకున్నారు.

–రామగిరి, మార్చి 29



నల్లగొండలో ఉగాది పచ్చడి కోసం కుండలు కొనుగోలు చేస్తున్న వినియోగదారులు

# జయహో బీఆర్ఎస్‌కేవీ

- పీఈఎల్ కార్మిక సంఘం ఎన్నికల్లో విజయకేతనం
- ఎమ్మెల్యే బీర్ల వ్యూహాలకు చెక్ పెట్టిన కార్మిక నేత గొంగిడి
- ఇది బీఆర్ఎస్ గెలుపు నామ సంవత్సరం : మహేందర్‌రెడ్డి

యాదగిరిగుట్ట, మార్చి 29 : యాదగిరిగుట్ట మండలం శనివారం మండలం పెద్దకందుకూరు గ్రామంలోని ప్రీమియర్ ఎక్స్‌ప్లోజివ్ కంపెనీ లిమిటెడ్(పీఈఎల్) యూనియన్ గుర్తింపు ఎన్నికల్లో బీఆర్ఎస్‌కేవీ ఘన విజయం సాధించింది. శనివారం జరిగిన ఎన్నికల్లో మొత్తం 390 ఓట్లకుగానూ బీఆర్ఎస్‌కేవీకి 209 మంది కార్మికులు మద్దతుగా ఓట్లు వేశారు. సీఐటీయూకి 179 ఓట్లు వచ్చాయి. హెచ్ఎంఎస్ ఒకటి, బీఎంఎస్ ఒక్క ఓటుతో సరిపెట్టుకున్నాయి. ముచ్చటగా మూడోసారి బీఆర్ఎస్‌కేవీ ఘన విజయం సాధించింది. బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్న సమయంలోనూ కార్మికులు ఈ స్థాయిలో బీఆర్ఎస్‌కేవీకి మద్దతు పలుకలేదు. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నా, ఆ పార్టీ అనుబంధ కార్మిక అనుబంధ సంఘమైన ఐఎన్‌టీయూసీ మద్దతుగా నిలిచిన సీఐయూటీకి కార్మికుల మద్దతు అంతగా లభించలేదు. ఫలితం వెల్లడి అనంతరం ఎప్పుడూ లేని విధంగా మెజార్టీ సాధించిన బీఆర్ఎస్‌కేవీ కార్మికుల ఆనందానికి అవధుల్లేవు. పీఈఎల్ కంపెనీ ఆవరణంలో బీఆర్ఎస్‌కేవీ పీఈఎల్ విభాగం అధ్యక్షుడు గొంగిడి మహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో విజయోత్సవాలు చేశారు. పటాకులు కాలుస్తూ సంబురాలు జరిపారు. జయహో బీఆర్ఎస్ కేవీ.. జయహో బీఆర్ఎస్... జై జై కేసీఆర్ అంటూ నినాదాలు చేశారు. ప్రతి కార్మికుడు గులాబీ రంగును పూసుకుని పండుగ చేశారు. గొంగిడి మహేందర్‌రెడ్డి కార్మికులకు స్వీట్లు తినిపిస్తూ శుభాకాంక్షలు తెలిపారు.



పెద్దకందుకూరులోని పీఈఎల్ కంపెనీ వద్ద బీఆర్ఎస్‌కేవీ సంబురాల్లో పాల్గొని మాట్లాడుతున్న గొంగిడి మహేందర్‌రెడ్డి

## ఎమ్మెల్యే బీర్ల ఒత్తిళ్లకు తలొగ్గని కార్మికులు

### బీఆర్ఎస్‌కేవీ అధ్యక్షుడు గొంగిడి మహేందర్‌రెడ్డి

పీఈఎల్ కంపెనీ యజమాన్యాన్ని మెప్పించి, కార్మికుల పక్షాన నిలువాలంటే దానికి రాజకీయ చరిష్మానే కాదు.. కార్మికుల పట్ల అవగాహన ఉండాలని బీఆర్‌ఎస్‌కేవీ పీఈఎల్ విభాగం అధ్యక్షుడు గొంగిడి మహేందర్‌రెడ్డి అన్నారు. ఫలితాల అనంతరం విజయోత్సవ ర్యాలీలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ప్రత్యక్షంగా పాల్గొని కార్మికులు ఓ టు వేసేందుకు ఎన్ని కుయుక్తులు పన్నారో తమకు తెలుసునన్నారు. అధికారంలో ఉండి కార్మికులపై ఆయన చేసి ఒత్తిడి ఇంత అంతాకాదన్నారు. రానున్నది విశ్వవసు నామ సంవత్సర ఆరంభామే కాదని.. బీఆర్ఎస్ గెలుపు నామ సంవత్సరమని పేర్కొన్నా రు. బీఆర్ఎస్‌కేవీ చరిత్రలో ఇది గొప్ప విజయమన్నారు. కాంగ్రెస్ పార్టీ అనుబంధ కార్మిక విభాగంతోపాటు సీఐటీయూ, వామపక్షాల కార్మికులంతా ఏకమైనా బీఆర్ఎస్‌కేవీ విజయాన్ని అడ్డుకోలేకపోయారని తెలిపారు. కార్మికుల పక్షాన నిలిచే ఏకైక కార్మిక సంఘంగా మరోసారి బీఆర్ఎస్‌కేవీ చరిత్రలో నిలిచిందన్నారు. రానున్నది కేసీఆర్ పాలననేనని కార్మికులకు అల్టిమేటం ఇచ్చారని పేర్కొన్నారు. పీఈఎల్ కార్మికులందరికీ బీఆర్‌ఎస్‌కేవీ అండగా నిలుస్తుందన్నారు. 12వ వేతన ఒప్పందాన్ని కార్మికులు మెచ్చే విధంగా ప్రతి కార్మికుడి సమక్షంలో సాధిస్తామని హామీనిచ్చారు. బీఆర్ఎస్‌కేవీ గెలుపు కోసం కృషి చేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

# హామీల అమలుకు కుంటిసాకులు

- కాలయాపన చేస్తున్న ప్రభుత్వం
- మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

రామన్నపేట, మార్చి 29 : పదిహేను నెలలు గడుస్తున్నా ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం కుంటిసాకులతో కాలయాపన చేస్తున్నదని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య విమర్శించారు. మండల కేంద్రంలో శనివారం విలేకరులతో ఆయన మాట్లాడారు. రైతులకు రెండు లక్షల రుణ మాఫీ అంటూ 60 శాతం మందికి చెయ్యలేదని మండిపడ్డారు. మండలానికి ఒక గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి సంక్రాతి పండుగకు హామీలు అమలు చేస్తామన్న ప్రభుత్వం ఉగాదికి వచ్చినా చేయకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. తెలుగు నూతన సంవత్సరంలోనైనా హామీలను అమలు చేసి చిత్తశుద్ధిని నిరూపించుకోవాలన్నారు. మండలంలోని నిర్నెంముల గ్రామానికి చెందిన గుర్రం సుధారాణి అనే మహిళా రైతుకు మూడెకరాల 32 గుంటల భూమి ఉంటే రూ.2,400 రైతు భరోసా డబ్బులు జమ అయ్యాయని, ఇదే ప్రజా పాలన అని నిలదీశారు. హామీలు అమలు చేయకపోవడంతో రైతులు, మహిళలు, యువత నిలదీస్తుండడంతో రాజీవ్ యువ వికాసం పేరుతో నయా మోసానికి తెర లేపారని మండిపడ్డారు. పథకాలకు రేషన్ కార్డుతో లింక్ పెట్టి కుటుంబంలో ఒక్కరికే పరిమితం చేస్తున్నారని పేర్కొన్నారు. మార్కెట్‌కు ధాన్యం వస్తున్నా నేటికీ కొనుగోళ్ల కేంద్రాలు ఏర్పాటు చేయడం లేదని తెలిపారు. ఇచ్చిన మాట ప్రకారం ఈ సీజన్‌కైనా బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రజా వ్యతిరేకత నేపథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం స్థానిక ఎన్నికలకు వెళ్లకపోవడంతో గ్రామాల్లో సమస్యలు పేరుకుపోతున్నాయని తెలిపారు. సమావేశంలో మాజీ ఎంపీపీ నీల దయాకర్, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ కంభంపాటి శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీలు సాల్వేరు అశోక్, వేమవరపు సుధీర్‌బాబు, పట్టణ కార్యదర్శి జాడ సంతోశ్, నాయకులు ఆమేర్, మిర్యాల మల్లేశం, రామిని లక్ష్మణ్, యానాల లింగారెడ్డి, బాసాని రాజు, ఏజాస్, ఆవుల సత్తయ్య, అంజద్ పాల్గొన్నారు.

# ఉద్యోగుల సమస్యలపై ప్రత్యేకంగా చర్చించాలి

### టీఎన్‌జీఓ రాష్ట్ర అధ్యక్షుడు జగదీశ్వర్





సమావేశంలో మాట్లాడుతున్న టీఎన్‌జీఓ రాష్ట్ర అధ్యక్షుడు జగదీశ్వర్

భువనగిరి అర్బన్, మార్చి 29 : కేబినెట్ సబ్ కమిటీ మీటింగ్ ఏర్పాటు చేసి ఉద్యోగుల సమస్యలపై చర్చ జరుపాలని టీఎన్‌జీఓ రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్ కోరారు. యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి పట్టణంలోని ఓ హోటల్‌లో శనివారం తెలంగాణ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగుల పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలని, డీఏలు మంజూరు చేయాలని, ఉద్యోగ, ఉపాధ్యాయ పెన్షనర్ల డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. గ్రంథాలయ, వైద్య విధాన పరిషత్, గురుకులాలు, డీఆర్‌డీఏ, మార్కెట్ కమిటీ, ఐకేపీ, మోడల్ సెకండ్ ఎస్ఎస్ఏ, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు వేతనాలు ప్రతినెలా చెల్లించాలని డిమాండ్ చేశారు. పంచాయతీరాజ్, రెవెన్యూ సిబ్బందిని పాత స్థానాలకు బదిలీ చేయాలని, ఉద్యోగులకు పీఆర్సీ, 51శాతం ఫిట్‌మెంట్ కల్పిస్తూ కొత్త వేతనాలు మంజూరు చేయాలని కోరారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని, గ్రామ పంచాయతీల పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలపై సానుకూలంగా స్పందించకుంటే టీజేఏసీ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయిలో ఏప్రిల్ 30న సదస్సులు, వినతి పత్రాలు, మే 4న రాష్ట్రస్థాయి సదస్సు, మే 15న జిల్లాలో నిరసన కార్యక్రమాలు, జూన్ 9న రాష్ట్ర స్థాయిలో మహాధర్నా చేపట్టనున్నట్లు తెలిపారు. సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడు ధరణికోట భగత్, ఎంప్లాయిస్ జేఏసీ జిల్లా చైర్మన్ మందడి ఉపేందర్‌రెడ్డి, టీజీఓ అధ్యక్షుడు జగన్‌మోహన్‌ప్రసాద్, టీఎన్‌జీఓ కార్యదర్శి ఎండీ ఖదీర్, కోశాధికారి శ్రీకాంత్, వైస్ ప్రెసిడెంట్ పి.శ్రీనివాస్, సభ్యులు మాటూరి అశోక్, శైలజ, కవిత పాల్గొన్నారు.



ఉగాది కవి సమ్మేళనంలో కవికి పురస్కారం అందిస్తున్న కూరెళ్ల విఠలాచార్య

# తెలుగు భాష ఔన్నత్యాన్ని చాటిచెప్పాలి

### పద్మశ్రీ కూరెళ్ల విఠలాచార్య

చౌటుప్పల్ రూరల్, మార్చి 29 : తెలుగు భాష ఔన్నత్యాన్ని చాటి చెప్పాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని పద్మశ్రీ కూరెళ్ల విఠలాచార్య అన్నారు. కళాభారతి సాహితీ సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలో శనివారం ఏర్పాటు చేసిన ఉగాది కవి సమ్మేళనం కార్యక్రమాన్ని రాజీవ్‌గాంధీ వైజ్ఞానిక విశ్వవిద్యాలయం ఉప కులపతి అలిసేరు గోవర్ధన్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కూరెళ్ల మాట్లాడుతూ తెలుగు భాషపై అభిమానం ప్రతి ఒక్క తెలుగువాడిలో ఉండాలన్నారు. ప్రపంచ భాషల్లో తెలుగుకు ప్రత్యేక స్థానం ఉందని తెలిపారు. అనంతరం కవులు దాసోజు పద్మావతి, వనం చంద్రమౌళి, దండమూడి శ్రీచరణ్, సాదు వెంకన్న, యాట వెంకటేశం, శివరామాచార్యులు, మహ్మద్ షరీఫ్‌కు క్రోదినామ సంవత్సర పురస్కారాలు అందజేశారు. కార్యక్రమంలో కళాభారతి సాహితీ సంస్థ అధ్యక్షుడు మోట సత్తయ్య, బడుగు శ్రీరాములు, కానుగల వెంకటయ్య పాల్గొన్నారు.



అధ్యయన కమిటీ సభ్యులు జూలూరి, టంకశాల, ఉపేంద్ర ఎదుట గోడు వెల్లబోసుకుంటున్న మెగ్గయ్యగూడెం రైతులు

# నీళ్లు లేక అప్పుల పాలైనం

## గత ఏడేండ్లలో గుంట ఎండింది లేదు

- ఇప్పుడు పొట్ట దశలోనూ పంటను కాపాడుకోలేకపోయాం
- మా గోడును ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లండి
- అధ్యయన కమిటీతో రైతుల ఆవేదన
- ప్రభుత్వం పరిహారం ఇచ్చి రైతులను ఆదుకోవాలి
- అధ్యయన కమిటీ సభ్యులు జూలూరీ, టంకశాల, ఉపేంద్ర

చివ్వెంల/పెన్‌పహాడ్, మార్చి 29 : 'గత ఏడేండ్లల్లో ఎస్సారెస్పీ కాల్వల ద్వారా నీళ్లు పొంగి పార్లినయి. పొలాల్లో మోకాళ్ల లోతు తేమ ఉండేది. గుంట కూడా ఎండింది లేదు. ఈ యాసంగిలో నీళ్లు రాక పంటలు ఎండిపోయినయి. బోర్లు కూడా పొయ్యక పొట్ట మీద పొలాలను కాపాడుకోలేక పోయినం' అంటూ సూర్యాపేట నియోజకవర్గ రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. మాగోడును ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిహారం వచ్చేట్లు చేసి ఆదుకోండి సారూ అంటూ ప్రాథేయపడ్డారు. చివ్వెంల మండలం మెగ్గయ్యగూడెం, పెన్‌పహాడ్ మండలంలోని ధర్మాపురం, మేగ్యాతండా, రత్యాతండాలో ఎండిన పంటలను అధ్యయన కమిటీ సభ్యులు తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్, ప్రముఖ రచయిత జూలూరి గౌరీశంకర్, సీనియర్ సంపాదకుడు టంకశాల అశోక్, బీసీ కమిషన్ మాజీ సభ్యుడు, హైకోర్టు న్యాయవాది ఉపేందర్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు తమ గోడు వెల్లబోసుకున్నారు. ఎస్సారెస్పీ కాల్వల్లో చూద్దామన్నా నీళ్లు లేవని వాపోయారు. ఎండిన పంటలకు ఎకరాకు ప్రభుత్వం రూ.30వేలు పరిహారం చెల్లించాలని కోరారు. మేగ్యాతండాకు చెందిన రైతు ఆంగోతు నర్సింగ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వానికి రైతులపై పట్టింపు లేదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో మంత్రిగా ఉన్న జగదీశ్‌రెడ్డి గోదావరి జలాలు చివరి వరకు చేరాలని తమ తండా దగ్గర కాల్వకు అడ్డుగా ఉన్న గెయిల్ ఇండియా గ్యాస్ పైప్ లైన్ కింద నుంచి సొరంగం తవ్వించి నీళ్లు అందించారని గుర్తుచేశారు. మోటార్ బైక్‌పై కాల్వ వెంట తిరిగి చిట్టచివరి ఉన్న మాచారం రావిచెరువును నింపారని తెలిపారు. అనంతరం అధ్యయన కమిటీ సభ్యులు మాట్లాడుతూ కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణ రాష్ట్రంలో పదేండ్లు సస్యశ్యామలంగా ఉండి, ఇప్పుడు సాగునీటి కష్టాలను ఎదుర్కొంటుండడం బాధగా ఉందన్నారు. రైతుల ఆవేదన చూస్తే దుఃఖం తన్నుకొస్తున్నదని తెలిపారు. ఇటీవల ఎండిన పంటలను చూసి మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి కంట పెట్టడం ఇక్కడి పరిస్థితులను తెలుపుతుందన్నారు. ఆనాడు నీళ్ల కోసం పోరా టం మొదలైన సూర్యాపేటలో మళ్లీ నీటి కష్టాలు వస్తాయనుకోలేదన్నారు. రైతుల పక్షాన మళ్లీ ఉద్యమాలు చెయ్యడానికి వెనుకాడమని స్పష్టం చేశారు. నీళ్లకు కూడా రాజకీయాలు ఉంటాయా అని నిలదీస్తూ పంటలు ఎండిన రైతులకు పరిహారం ఇచ్చి ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అన్నం పెట్టే రైతులను కాపాడలేని ప్రభుత్వం రాష్ట్రాన్ని ఎలా కాపాడుతుందని ప్రశ్నించారు. జిల్లాలో ఉన్న ఇద్దరు మంత్రులు క్షేత్రస్థాయిలో ఎండిన పంటలను పరిశీలించి నష్టపరిహారం ఇప్పించాలని కోరారు. కార్యక్రమంలో తెలంగాణ యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనంతుల మధు, కొలికపంగి వాసు, నగేశ్, రైతులు కొనకంచి వీరభద్రయ్య, నారాయణరెడ్డి, లక్ష్మీ, వాల్యా, మద్దు వినయ్‌కుమార్, బాలు, మాజీ సర్పంచ్ నెమ్మాది నగేశ్, భూక్యా రవి, ఆంగోతు సైదా, గుండు రామన్న పాల్గొన్నారు.

# చితికిపోతున్న టమాట రైతు

## కిలో టమాటకు 3 రూపాయలే..

- కోత కూళ్లు, రవాణా ఖర్చులకూ చాలవంటున్న రైతులు
- చేతికి వచ్చిన పంటను అలాగే వదిలిపెట్టిన దైన్యం
- అప్పులే మిగిలాయంటున్న చిన్నమాదారం రైతు కుటుంబం

నల్లగొండ సిటీ, మార్చి 29 : పంట ఏదైనా అష్టకష్టాలు పడి దిగుబడి తీసుకుని రైతులు తీరా మార్కెటింగ్‌కు వచ్చేసరికి డీలా పడుతున్నారు. వేసవి, నీటి ఎద్దడి నేపథ్యంలో వరికి బదులు కూరగాయల సాగు వైపు మొగ్గు చూపిన రైతులు ఇప్పుడు సరైన ధర లేక కుదేలవుతున్నారు. మార్కెట్లో ధర అమాంతం పడిపోవడంతో దళారులు కిలో మూడు రూపాయలకు మించి ఇవ్వడం లేదని రైతులు వాపోతున్నారు. దాంతో పెట్టుబడులు వెళ్లడం అటుంచి.. పంట కోస్తే కూలీల ఖర్చులు కూడా వెళ్లని పొలంలోనే వదిలేస్తున్నట్లు చెప్తున్నారు. గతంలో కేజీ రూ.100 వరకు కూడా టమాట అమ్మిన రోజులు లేకపోలేదు. కానీ అదే టమాట ధర అమాంతం పడిపోవడంతో రైతులు అప్పుల పాలవుతున్నారు. నెల రోజుల క్రితం వరకు బహిరంగ మార్కెట్లో కిలో టమాట ధర 20 నుంచి 30 రూపాయల వరకు పలికింది. ఇప్పుడు కిలో రూ.10 నుంచి 20 రూపాయలకు అమ్ముతున్నారు. కానీ అదే దళారులు రైతులకు మాత్రం కిలో 3 రూపాయలకు మించి ఇవ్వడం లేదు. ఈ నేపథ్యంలో పంట కోసి, మార్కెట్‌కు తరలించాలంటే కూళ్లు, రవాణా ఖర్చులకు సరిపోవని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనగల్ మండలం చిన్నమాదారం గ్రామపంచాయతీ పరిధిలోని ఎర్రగూడేనికి చెందిన రైతు ఈద గోవింద్ తనకున్న ఎకరంన్నరతోపాటు మరో రెండెకరాలు కౌలుకు తీసుకుని నర్సరీ నుంచి టమాట నారు తెచ్చి పోశాడు. కౌలుకు రూ.40 వేలు, దున్నకం, నారు, నాటుకూళ్లు, మందులకు కలిపి మరో రూ.2 లక్షల వరకు ఖర్చు చేశాడు. తీరా పంట చేతికి వచ్చే సరికి టమాట ధర అమాంతం పడిపోవడంతో పెట్టుబడి కూడా వెళ్లని పరిస్థితి నెలకొంది. కూలీలను పెట్టి టమాటలు కోసి 100 బాక్సులను ఆటోలో మార్కెట్‌కు తరలిస్తే రూ.4వేలు మాత్రమే వచ్చాయి.

దాంతో అదనంగా చేతి నుంచి ఖర్చులు మీద పడ్డాయి. ఇలాంటి పరిస్థితుల్లో చేసిదిలేక పంట కోయకుండానే తోటను అలాగే వదిలేయడంతో స్థానికులు గొర్రెలు, పశువులను మేపుకొంటున్నారు.



కనగల్ మండలం ఎర్రగూడెంలో టమాట తోటలో మేస్తున్న గొర్రెలు, మేకలు



రైతు గోవింద్ తోటలో వదిలిన టమాటాలు

### కూళ్లు, ఆటో ఖర్చులకు చాలవు

నానా అవస్థలు పడి టమాట సాగు చేసి పంట తీసినం. పెట్టుబడికి రెండున్నర లక్షలు ఖర్చు అయింది. తీరా పంట చేతికి వచ్చేసరికి ధర లేకుండా పోయింది. కిలో మూడు రూపాయల లెక్కన అడుగుతున్నరు. ఆ రేటుకు అమ్మితే కూళ్లు, ఆటో ఖర్చులకు కూడా చాలవు. దాంతో గొర్ల మేతకు పెట్టినం. అప్పు తెచ్చి పెట్టుబడి పెట్టినం. ప్రభుత్వమే ఆదుకోవాలి.

-ఈద సుగుణమ్మ, మహిళా రైతు, చిన్నమాదారం

